# సత్యభామ చెలికత్తె

అది సత్యభామ శృంగార వనం. ఆ ఉద్యాన వనశోభ వర్ణనాతీతం. అచటి పూలలోని మకరందం వాగులై ప్రవహిస్తుంటే, అచటి తుమ్మెదలు ఝుంకారం చేస్తూ తిరుగాడు తుంటే, సత్యభామ, చెలికత్తెలు చుట్టు ముట్టగా శ్రీకృష్ణుని గుణగణాలు వర్ణించి చెప్తోంది. పాలరాతి వేదికపై కూర్చుని కృష్ణుని గూర్చి ముచ్చటిస్తూ మన్మధ పరవశయైన సత్యభామ శరీరం పులకాంకితమైంది. ఆమె చెక్కిళ్ళు మరీ ఎర్రబడ్డాయి.

అంతలోనే సత్యభామ మనసు చింతాక్రాంతమైంది. ఉన్నట్టుండి సత్యభామ శరీర దక్షిణ భాగం అదిరినట్టయింది. ఇది అశుభమని సత్య మనసు కీడుని శంకించింది.

తను పంపిన ఇష్ట సఖిరాక ఎందుకు ఆలస్యమయిందో అర్థకాక కలత చెందింది సత్యభామ. శృంగారవనంలోని చల్లగాలులు, పరిమళాలు వెదజల్లే పూలు, ఆ ప్రాంతమంతా ఎటు చూసినా ఏదో వేదన కలిగిస్తోంది సత్యభామకి.

సత్యభామ చెలికత్తె నమ్మిన బంటు. అమ్మగారికి ఆవగింజంత అవమానం జరిగినా భరించలేదు. అలాటి సత్య చెలికత్తెకి రుక్మిణీ మందిరంలో జరిగిన సంఘటనకి మనసు చాలా నొచ్చుకుంది.

దూరంగా, అడుగులో అడుగువేస్తూ తలదించుకు వస్తున్న చెలికత్తె కనబడగానే సత్యభామకు ప్రాణం లేచి వచ్చినట్టయింది ఒక్కసారి.

రుక్మిణీ మందిరంలో జరిగిన సంఘటన తల్చుకుంటున్న కొద్దీ సత్య చెలికత్తె మనసు మరీ అవమానంతో కృంగిపోయింది. తమ అమ్మగారికి అవమానం కల్గితే, తామంతా చూస్తూ ఊరుకుంటారా – చెలికత్తె నడక వేగం పెంచింది.

శ్రీకృష్ణుడు రుక్మిణీ భవనాని కొచ్చినపుడు చెలికత్తెలంతా అక్కడే వున్నారు. నారదుడు వచ్చి దివ్యపారిజాతాన్ని తెచ్చి కృష్ణుని కనుసన్నలతో రుక్మిణికి అందించినపుడే, దగ్గరుండి చూస్తున్న చెలికత్తె ఒళ్ళు భగ్గుమంది. అందరి చెలికత్తెలు ఒక ఎత్తు, సత్యభామ చెలికత్తె ఒక ఎత్తు!

తలవంచుకు నిలబడ్డ, చెలి భుజాన చేయివేసి ఏమైందని ఆవేదనతో ప్రశ్నించింది సత్యభామ.

"అమ్మా ఏంచెప్పను, నానోటితో నేను ఎలాచెప్పను" వంచిన తల ఎత్తలేదు చెలికత్తె.

"ఇలాకూచో - నెమ్మదిగా చెప్పు, ఏం జరిగింది ఆ రుక్మిణీ మందిరంలో" - తత్తర పాటుతో చెలికత్తె ముఖాన్ని చూస్తూ అంది సత్య.

చెలికత్తె ముందు వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ తర్వాత కళ్ళలో నిప్పులే కురిపించింది. ఎంతటి అవమానం - దీర్ఘంగా నిట్టూర్చింది. సత్యభామకి ఏమీ అర్థం కావటంలేదు. ఒక్కటి మాత్రం ఖాయం -జరిగింది అవమానం, తనకా, తన చెలికత్తెకా తెలయలేదు సత్యకు.

"అమ్మా, ఆ నారదుడు పారిజాత పుష్పాన్ని రుక్మిణికిస్తే ఇచ్చాడు...కానీ ఆ మాటలు, అబ్బబ్బ - చెప్పలేను తల్లీ" - చెలికత్తెగొంతు గాద్గదికమైంది. సత్యభామ కళ్ళలో ఎరుపు అలుము కొంది.

"ఇన్ని రోజుల నుంచీ సవతులందరిలో నేనే గొప్ప అని విర్రవీగే మీ సత్యభామ గర్వం ఇక చెల్లదన్నాడు....అంతేకాదు కృష్ణునికి నీ ఎడల ఎంత గౌరవమో ఆమెకేం తెలుసు....అందుకే ఈ పారజాతం నీకిప్పించాడు అని నాధుడంటుంటే ఆ రుక్మిణిమ్మగారి ముఖం ఎంత గర్వంతో వెలిగిపోయిందో ఏం చెప్పను తల్లీ... అయ్యో!" - చెలికత్తె కళ్ళు ఒత్తుకుంది.

సత్యభామ దెబ్బతిన్న ఆడనాగైంది. "చెలీ - ఇన్ని మాటలు నాదుడంటుంటే హాయిగా వింటూ కూర్చున్నాడా కృష్ణుడు"-

"అవునమ్మా - పైగా ఆ సత్యభామ గర్వం ఈదెబ్బతో పోతుందిలే అన్నాడమ్మా."

"ఆ-ఇంకేమన్నాడు-"

చెలికత్తెను దగ్గరగా కూచోపెట్టుకుంది. సత్యభామ ముఖంలో బేలత్వం నిండిపోయింది. ప్రాణానికి ప్రాణమనుకున్న భర్త తనను గూర్చి సవతి ఇంట్లో అలా మాట్లాడితే, తన బతుకెెందుకింక! -దీర్ఘంగా నిటూర్చింది సత్యభామ.

చెలికత్తె ఇంకా ఇంకా రుక్మిణీ భవనంలో జరిగిన విశేషాలు చెప్తుంటే, వింటున్న సత్యభామకు రుక్మిణిపై కోపం కన్నా కృష్ణునిపై కోపం క్షణాలలో పెరిగిపోయింది.

"అమ్మా-ఆ రుక్మిణమ్మ ఆ పూవు సిగలో ధరించేసరికి ఎంతలావణ్యం కలిగిందో. ఎంత సౌందర్యం ఇనుమడిచిందో నేనెలా చెప్పగలను...అమ్మా, సత్యాదేవీ, ఆపూవు ప్రభావమేమిటో కానీ, అందరూ సమ్మోహితులైనట్లుగా రుక్మిణిని సేవించటం మొదలు పెట్టారమ్మా"-

"అందరూ రుక్మిణిని సేవించటమా"- ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసింది సత్య.

"రుక్మిణి పాదాలపై వారు పడుతుంటే, ఆ రుక్మిణమ్మ పెద్ద సింహాసనం పై కూచుని ఈ ముల్లోకాలుతానే ఏలుతున్నంత వైభవంతో కన్పించిందమ్మా"-

చెలికత్తె చెప్తున్న మాటలు తిన్నగా సత్య గుండెల్ని చేరి శూలాల్లా చీలుస్తున్నాయి. ఆవేశం కట్టలు తెంచుకుంది. ఆగ్రహం హద్దు మీరింది. కృష్ణుడు చేసిన అవమానం ఇది. నారదుని మాటల్ని ఖండించి "నేను సత్యాపతినని, నా సత్యను గూర్చి ఇట్లా అనవద్దని ఒక్కమాట అనలేదా ఆ కృష్ణుడు"- సత్యభామ బుసలు కొట్టింది ఆడనాగై.

"ఇంకేమేమి అన్నాడో మొగమాటం లేక చెప్పవా చెలీ" అంది, నీళ్ళు నిండిన కళ్ళతో తనను చూస్తున్న చెలికత్తె 'భుజంపై చేయివేసి దగ్గరకి తీసుకుంటూ "చెలీ - ఆ నారదుణ్ణి, ఆ రుక్మిణిని నేనేమీ అనను - ప్రాణంలో ప్రాణం భర్తే యిట్లంటే నా మనసు మండిపోక ఏంచేస్తుందీ" శూన్యంలోకి చూస్తుంది సత్యభామ.

"అవునమ్మా - అంతా అయ్యగారిదే తప్పు -" "ఇంతవరకు కలలోకాని నవ్వులకు గానీ నామాట జవదాటని కృష్ణుడు, ఈనాడు రుక్మిణీ మందిరంలో ఆమెను మన్నించి, నన్ను అవమానించాడంటే - చెలీ, ఎలా బతకగలనే ఇంక"-

"నిజమేనమ్మా -" చెలికత్తె సత్యభామ చేయిపట్టుకొని చంద్రకాంత శిలావేదిక పై నుంచి లేపింది. సత్య మనసంతా చీకటే.

తన చెలికత్తె ఎంత విశ్వాసపాత్రురాలో, తనపై ఎంత ప్రేమో వుందో, తనకి జరిగిన అవమానం భరించలేక ఎంత దుఃఖించిందో తల్చుకుంటుంటే, సత్యభామకు ఆ చెలికత్తెపై జాలీ, ప్రేమ, గౌరవం కూడా కలిగాయి.

తక్కిన దేవేరుల చెలికత్తెలంతా ఆ రుక్మిణిని సేవిస్తుంటే, తన చెలికత్తె ఒక్కతె కదా పరిగెత్తి వచ్చి, అక్కడ జరిగిన ఉదంతం తనకుచెప్పిందని ఎంతో ఆనందించింది- ఆ ధూర్త గోపాలుని చేష్టలు, మాటలు తనకు తెలిసేవికాదు కదా - సత్యభామ ఎదురుగా నిల్చున్న చెలివంక చూస్తూ "ఇదిగో ఈ మాట మనసులో దాచుకో" అంది రహస్యంగా, చెలికత్తె తలపూపింది నమ్రతతో.

చక చకా కోప గృహాన్ని చేరుతున్న సత్యభామను చూస్తూ, అంతఃపురమంతా నిశ్శబ్దంగా వుండేటట్టు చేసే ఏర్పాట్లలో మునిగిపోయింది సత్యభామ చెలికత్తె!

- కావ్యతారలు - వనిత నవంబరు 1989